తెలంగాణ TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 25- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 21 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




# తుంగభద్ర జలాల కోసం కేంద్రం జోక్యం చేసుకోవాలి

## సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ వాటా నీటి వినియోగంపై ఉన్నతస్థాయి సమీక్ష
- ఆర్డీఎస్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయం
- జోగులాంబ గద్వాల జిల్లాకు నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

తుంగభద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తుంగభద్ర ప్రాజెక్టు, రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్), అంతర్రాష్ట్ర జల వివాదాలపై జలసౌధలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా ప్రస్తుతం అయిదు నుంచి ఆరు టీఎంసీలకు మించి అందడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ పరిధిలో జోగులాంబ గద్వాల జిల్లాలోని 75 గ్రామాల్లో సుమారు 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు భాగస్వాములుగా ఉన్న నేపథ్యంలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తుంగభద్ర బోర్డును మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మూడు రాష్ట్రాల మధ్య సమన్వయం పెంచి నీటి వినియోగం సమర్థవంతంగా జరిగేలా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగతా 2లో

# ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.1.22 కోట్ల మోసం

### ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్

### నకిలీ పెట్టుబడి వేదికలతో భారీ మోసాలు

### సైబర్ నేరాల ఆర్థిక నెట్‌వర్క్ ఛేదించిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడుల పేరుతో భారీ సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా వలలో చిక్కుకున్న ఓ వ్యక్తి రూ.1.22 కోట్లు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో ఐదుగురు మహారాష్ట్రకు చెందినవారు కాగా, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన బాధితుడిని

మిగతా 2లో



# అవకాశాలు కల్పిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు

- వీటా ఇండియా విభాగం ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి
- మహిళల సాధికారతకు వేదికలు విస్తరించాలి
- రాజకీయాలు, నిర్ణయాత్మక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి

2లో



# మహిళల సాధికారతకు సమిష్టి కృషి అవసరం

- కల్వకుంట్ల కవిత
- వెటా ఇండియా మహిళా సాధికారత సదస్సులో ప్రసంగం
- సమాజంలో మహిళలకు ఇంకా అనేక అడ్డంకులు
- మహిళల ఎదుగుదలకు కుటుంబం, ప్రభుత్వం, సమాజం తోడ్పడాలి

హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):



మహిళల సాధికారత కోసం ప్రభుత్వం, కుటుంబం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వెటా ఇండియా మహిళా సాధికారత కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళలు ఎంత ప్రతిభ కనబరిచినా, ఎంత కష్టపడ్డా సమాజంలో అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగాలు, పదోన్నతులు, నాయకత్వ స్థానాల్లో మహిళలకు సమాన అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న వివక్షను తొలగించేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు తమ లక్ష్యాలను నిర్దేశించుకున్న తర్వాత వెనక్కి తగ్గకుండా ముందుకు సాగాలని ఆమె సూచించారు. విజయాన్ని సాధించాలంటే ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎంతో ముఖ్యమని చెప్పారు. మహిళలు ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తు చేసిన కవిత, అయినప్పటికీ ఆ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదని అన్నారు. దీనికి కుటుంబాలు, సమాజం నుంచి తగిన ప్రోత్సాహం లేకపోవడమే కారణమని అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో




# బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

### సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశాలు

### భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచన

హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో లండన్ నుంచి జూమ్ ద్వారా పాల్గొని ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఒకే కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన బోనాలను ఈసారి మూడు కార్పొరేషన్ల పరిధిలో మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే ఈ మహోత్సవం విజయవంతం కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో ప్రారంభమయ్యే ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు.

మిగతా 2లో

# గోదావరి తాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

- ఫేజ్-2, ఫేజ్-3 పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి
- సెప్టెంబర్-2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని ఆదేశం
- హైదరాబాద్ భవిష్యత్ నీటి అవసరాలకు భారీ ప్రణాళిక

హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్ నగర భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్ 2, ఫేజ్ 3 పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తూ నిర్మాణ సంస్థలు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తుంగభద్ర జలాల కోసం కేంద్రం జోక్యం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆర్డీఎస్ ఆనకట్ట భద్రతపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఆనకట్ట ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, భద్రతా పరమైన పనులను అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆధునికీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.59 కోట్లు డిపాజిట్ చేసినప్పటికీ ప్యాకేజీ 1, ప్యాకేజీ2 పనులు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు వివరించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ వైపు భారీగా పూడిక పేరుకుపోవడం వల్ల నీటి మళ్లింపు ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఇంజనీర్లు తెలిపారు. 2004లో నిపుణుల కమిటీ చేసిన పూడికతీత, ఇతర సాంకేతిక సిఫారసులు ఇప్పటికీ అమలుకాలేదని సమావేశంలో చర్చించారు. పూడిక తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని, ఇందుకు కర్ణాటక సహకారం కూడా కోరాలని నిర్ణయించారు.



తుంగభద్ర ఎత్తిపోతల పథకం ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని వినియోగించుకునే మార్గాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తుమ్మిళ్ల ప్రాజెక్టుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతకు సమిష్టి కృషి అవసరం

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు, న్యాయరంగం, పరిపాలన సహా అనేక రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలు ప్రతిభ చూపుతున్నప్పటికీ ఉన్నత స్థాయిలకు చేరుకునే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని చెప్పారు. సమాన అవకాశాలు కల్పించకుండా మహిళా సాధికారత సాధ్యం కాదన్నారు. సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న ఈ కాలంలో యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కవిత సూచించారు. మహిళలపై ఉన్న పాత అభిప్రాయాలు, సామాజిక పరిమితులను అధిగమించి లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో మార్పు ఒక్క రోజులో రాదని, ఆడమగ అనే తేడా లేకుండా అందరూ కలిసి పనిచేసినప్పుడే మహిళా సాధికారత నిజంగా సాధ్యమవుతుందని అన్నారు.






# గోదావరి తాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మల్లన్నసాగర్ వద్ద నిర్మాణంలో ఉన్న పంప్ హౌస్‌తో పాటు 3000 మిల్లీమీటర్ల వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణ పనులను అశోక్ రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు అమలులో కొనసాగుతున్న వివిధ నిర్మాణ కార్యకలాపాలపై అధికారులను అడిగి తెలుసుకొని పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

హైదరాబాద్ నగరానికి దీర్ఘకాలిక తాగునీటి భద్రత కల్పించడంలో ఈ ప్రాజెక్టు కీలకమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న ఈ పనులు సమయానికి పూర్తవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు సిబ్బంది, యంత్రాలను సమకూర్చుకోవాలని నిర్మాణ సంస్థల ప్రతినిధులకు సూచించారు. నిర్మాణ దశలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనుల పురోగతిని మరింత మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు.

ప్రాజెక్టును సెప్టెంబర్2027 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జలమండలి ఎండీ స్పష్టం చేశారు. నిర్ణీత గడువును లక్ష్యంగా పెట్టుకుని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అశోక్ రెడ్డి ఆదేశించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ పనులు నిర్వహించాలని, ఎటువంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ మహేష్ కుమార్, ప్రాజెక్టు విభాగ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవకాశాలు కల్పిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు

**హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**

మహిళలకు అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని కార్మిక, ఉపాధి, శిక్షణ, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో వీటా (విమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్) ఇండియా విభాగం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన మహిళా సాధికారత సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల సాధికారత, ఉపాధి అవకాశాలు, గ్రామీణ మహిళల ప్రపంచ స్థాయి ప్రభావం వంటి అంశాలపై నిర్వహించిన ఈ సదస్సులో పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థినులు పాల్గొన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోగతికి కృషి చేస్తున్న సంస్థల సేవలను మంత్రి అభినందించారు.



వీటా వ్యవస్థాపకురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. గృహిణిగా జీవితాన్ని ప్రారంభించి విజయవంతమైన పారిశ్రామికవేత్తగా ఎదగడమే కాకుండా అమెరికాలో వీటా సంస్థను స్థాపించి, ఇప్పుడు భారతదేశంలో కూడా కార్యకలాపాలను విస్తరించడం మహిళల సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. మహిళలు విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, పరిపాలన, రాజకీయాలు తదితర అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని మంత్రి తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారి భాగస్వామ్యం లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు.

రాజకీయాలు, నిర్ణయాత్మక పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ముఖ్యంగా పురుషుల సహకారం మహిళల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళల సమయాన్ని, కృషిని గౌరవిస్తూ వారి లక్ష్యాల సాధనకు కుటుంబాలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమాజ పురోగతికి తోడ్పడుతూ కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న మహిళల గొంతుక మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే మహిళలు ఏ లక్ష్యాన్నైనా చేరుకోగలరని పేర్కొన్నారు. వీటా ఇండియా తెలంగాణ విభాగం చేపట్టనున్న కార్యక్రమాలు మహిళలు, యువతులు, విద్యార్థినుల సాధికారతకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.1.22 కోట్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది జనవరిలో "282 బార్‌క్లేస్ ఇండియా హై క్వాలిటీ స్టాక్ ట్రేడింగ్ రీసెర్చ్ గ్రూప్" పేరుతో నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. అధిక లాభాలు, ప్రత్యేక ఐపీఓ కేటాయింపులు వస్తాయని నమ్మించి నకిలీ పెట్టుబడి వేదికల ద్వారా డబ్బులు పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టారు.



మొదట బాధితుడి విశ్వాసం పొందేందుకు రూ.1.05 లక్షలను విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో నమ్మకం పెంచుకున్న బాధితుడు 19 విడతల్లో మొత్తం రూ.1,22,18,029 పెట్టుబడి పెట్టాడు. అనంతరం అతని ఖాతాలో రూ.15.69 కోట్ల లాభం వచ్చినట్లు నకిలీ వివరాలు చూపించి మరింత డబ్బు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. ఐపీఓ షేర్ల కేటాయింపు పేరుతో మరో రూ.35 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మోసం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితులు మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించి నిధుల బదిలీలు జరిపినట్లు తేలింది. పలు కంపెనీల పేర్లతో అధిక విలువ గల కరెంట్ ఖాతాలు తెరిచి, వాటి ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను ఇతరులకు అందజేస్తూ కమీషన్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా అనేక సైబర్ మోసాల లావాదేవీలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. సైబర్ నేరాల నిరోధానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా వచ్చే పెట్టుబడి ఆఫర్లను గుడ్డిగా నమ్మవద్దని హెచ్చరించారు. అధిక లాభాలు, తక్కువ సమయంలో భారీ ఆదాయం వస్తుందనే హామీలతో వచ్చే పెట్టుబడి ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.


# బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

బోనాల సమర్పణ, ఘటోత్సవాలు, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ జానపద వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను ఆలయాల అభివృద్ధి, విద్యుత్ దీపాలంకరణలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు, భక్తుల సౌకర్యాల కోసం సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

ఉత్సవాల సందర్భంగా రవాణా, పోలీసు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, మెట్రో, పర్యాటక తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## చింత వరుణ్ తేజ్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటు

- **సింగపురం ఇందిరా,కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్**

**స్టేషన్ ఘనపూర్, జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీకి చెందిన చింత వరుణ్ తేజ్ ఇటీవల ప్రమాదవశాత్తు ఈతకు వెళ్లి మృతి చెందిన ఘటన పట్ల స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిరా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వరుణ్ తేజ్ కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించిన ఆమె, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు.

యువకుడి అకాల మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చిన సింగపురం ఇందిరా, ఈ నష్టం ఆ కుటుంబానికి తీరనిదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింగపురం నాగయ్య, సీనియర్ నాయకులు సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, చింత జోగి, సింగపురం సందీప్, రాజ్‌కుమార్, రాజవరపు ప్రసాద్, చింత రాజు, చింత శ్యామ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అదనపు డైరెక్టర్‌ను కలిసిన టిఐసీసీఐ రాష్ట్ర నాయకులు

**హైదరాబాద్,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** ట్రైబల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టిఐసీసీఐ ) తెలంగాణ చాప్టర్ ప్రతినిధులు తెలంగాణ పరిశ్రమల శాఖ కమిషనరేట్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అదనపు డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గిరిజన పారిశ్రామికవేత్తల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా గిరిజన పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపన కోసం భూముల కేటాయింపు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల సమర్థ అమలు, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, పారిశ్రామిక రంగంలో గిరిజన యువత భాగస్వామ్యాన్ని పెంచే చర్యలపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈ సందర్భంగా టిక్కీ తెలంగాణ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షుడు ధరవాత్ శ్రీనివాస్ మాట్లాడుతూ, గిరిజన యువతలో పారిశ్రామిక రంగంపై అవగాహన పెంపొందించడంతో పాటు వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరమన్నారు. గిరిజన పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు భూ సేకరణలో ప్రభుత్వం సహకరించాలని కోరారు.గిరిజన సమాజ ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామిక రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన, ప్రభుత్వం మరియు గిరిజన పారిశ్రామికవేత్తల మధ్య వారధిగా టిక్కీ తెలంగాణ చాప్టర్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో టిక్కీ తెలంగాణ చాప్టర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శి రాంచందర్ నాయక్, యూత్ ఎంటర్‌ప్రెన్యూర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అశోక్ నాయక్‌తో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- **లింగంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన**
- **జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగాం,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లి గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ నిర్వహించిన ఎమ్మెల్యే అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. ప్రతి గ్రామంలో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాల రూపురేఖలు మారనున్నాయని అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

# గోపాల్పూర్ గుడిసెవాసులకు ఇండ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి

**హన్మకొండ,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** గోపాల్పూర్ గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు పొందిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని ఆరోపించారు.గోపాల్పూర్ చెరువులో సరైన రక్షణ చర్యలు లేకపోయినా మట్టి, మొరంను అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారని, దీనిపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. చెరువు సమీపంలోని రక్షణ గోడ దెబ్బతింటే దాదాపు 18 కాలనీలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



వడ్డేపల్లి చెరువు నుంచి తులసి బార్ వరకు ఉన్న కాలువకు బలమైన రక్షణ గోడ నిర్మించాలని, గత వరదల్లో దెబ్బతిన్న కాలువను ఇప్పటికీ పునరుద్ధరించకపోవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందన్నారు. తులసి బార్ నుంచి సమ్మె నగర్ వరకు కూలిపోయిన కాలువ గోడలను వెంటనే మరమ్మతు చేయాలని, కాలువల్లో పేరుకు పోయిన మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు.

పేదల హక్కుల కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చిన నాయకులు, మరో భూ పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. జూన్ 27న ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే నిరసన ర్యాలీలో వామపక్ష పార్టీలతో పాటు అన్ని గుడిసెవాసుల సంఘాలు పాల్గొంటాయని తెలిపారు.

ఇండ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం కొనసాగిస్తామని, పేదల ఐక్యతతోనే ప్రభుత్వాలను ప్రశ్నించగలమని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలంతా ఏకమై తమ హక్కుల సాధన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం హనుమకొండ మండల కార్యదర్శి వీరన్న, డీవైఎఫ్ఐ నాయకురాలు దీప, నాయకులు రవీందర్, రాజు, రాధిక, స్వప్న, సబిత, పావని, శృతి, పద్మ, సమ్మయ్య, రాధా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం

**వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**హన్మకొండ,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై విద్యార్థులకు మద్దతుగా హనుమకొండలో నిర్వహించిన భారీ కాగడా ర్యాలీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు జరిగిన ర్యాలీలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ర్యాలీ అనంతరం నీట్ ప్రశ్నాపత్ర లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు క్యాండిళ్లు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కడియం కావ్య మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల విద్యా హక్కులను పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు.





నీట్, జేఈఈ, యూపీఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా వెలుగుచూస్తున్న అక్రమాలు లక్షలాది మంది విద్యార్థుల ఆశలను ఛిద్రము చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు.

పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కలలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించిన ఆమె, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరిగినా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ గుండు సుధారాణి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక దృష్టి..!

- **హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, నాయిని చెరువు పరిసరాల పరిశీలన**
- **ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చైర్మన్ హామీ**

**జమ్మికుంట టౌన్ జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద నీటి సమస్యలపై అప్రమత్తమైన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) 6, 22, 30వ వార్డులను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, నాయిని చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు ఎలాంటి



ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, వర్షాకాలంలో వరద నీటి సమస్యల వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని, పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎక్కడైనా నీటిమునిగే పరిస్థితులు, డ్రైనేజీ సమస్యలు లేదా ఇతర అత్యవసర ఇబ్బందులు తలెత్తినట్లయితే మున్సిపాలిటీ టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొనగంటి రాము, చందా రాజు, శ్రీపతి నరేష్, మంద రాజేష్, బోళ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

# డప్పు చప్పుళ్లు, బోనాల ఊరేగింపులతో సందడిగా రేణుక ఎల్లమ్మ తల్లి జాతర

**హుజూరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ పట్టణంలోని 29వ వార్డులో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు, 29వ వార్డు కౌన్సిలర్ బోరాగాల మొగిలి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతర సందర్భంగా డప్పు చప్పుళ్లు, బోనాల ఊరేగింపులు, భక్తుల జైజైధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పిస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించగా, యువకులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తుల రద్దీతో జాతర ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే గొప్ప సాంస్కృతిక వేడుక అని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తి భావంతో పండుగలను నిర్వహించడం



ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో హుజూరాబాద్ పట్టణం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కౌన్సిలర్ బోరాగాల మొగిలి మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి జాతరను ప్రతి సంవత్సరం ప్రజలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వార్డు ప్రజల సహకారంతో జాతర విజయవంతంగా సాగిందని తెలిపారు. అమ్మవారి కృప ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, వార్డు ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ బోనాల జాతర హుజూరాబాద్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రిజర్వేషన్ల పరిరక్షణకు ఉద్యమించాలి

- దళిత బహుజన ఐక్యత అత్యవసరం
- బూర్గుల నాగేందర్ మాదిగ,
- మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు



**హైదరాబాద్,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం(టిఎంజెఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత బూర్గుల నాగేందర్ మాదిగ పిలుపునిచ్చారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా కల్పించబడిన రిజర్వేషన్ హక్కులను నిర్వీర్యం చేసేందుకు పాలక వర్గాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న రిజర్వేషన్లను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా దళిత బహుజన ఐక్య ఉద్యమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. దళిత బహుజనులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాదిగ హక్కుల కోసం సాగుతున్న పోరాటానికి 32 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రకాశం జిల్లాలోని ఈదుమూడిలో జూలై 7న నిర్వహించనున్న అమరవీరుల స్మారక కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కారంచేడు, చుండూరు, వేంపంట ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి త్యాగాల స్ఫూర్తితో రిజర్వేషన్లు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.మాదిగ జర్నలిస్టు ఫోరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు మాదిగ ఉపకులాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఉద్యమాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు సుంచు లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్, నాయకులు నలువాల మహారాయుడు, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక గర్జన సభకు ఎంపీ కడియం కావ్యకు ఆహ్వానం



**హన్మకొండ,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ హక్కుల సాధన లక్ష్యంగా జూలై 5న హనుమకొండ జిల్లా మడికొండలోని కరిష్మా గార్డెన్‌ఈలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల కార్మిక గర్జన మహాసభకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ కొత్తపల్లి భిక్షపతి, జిల్లా సహ కన్వీనర్ ఉపేందర్ కలిసి ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, నిర్మాణ కార్మికుల హక్కుల పరిరక్షణ అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. మహాసభకు తప్పకుండా హాజరవుతానని ఎంపీ కడియం కావ్య హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జూలై 5న జరిగే కార్మిక గర్జన మహాసభను విజయవంతం చేయాలని, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

# ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



**హనుమకొండ,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధ్యయన కేంద్రం (స్టడీ సర్కిల్), బంజారాహిల్స్, హైదరాబాద్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (CSAT) - 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కలెక్టరేట్‌లో బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు దివ్యాంగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.
అభ్యర్థులు 19 జూన్ 2026 నుంచి 12 జూలై 2026 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకోసం http://tsstudycircle.co.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 19 జూలై 2026న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో కూడిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డా. కె. జగన్ మోహన్, పర్యాటక అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఎం. శివాజీ, కనకరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసిన సర్పంచ్ మంజుల



**పెద్దమందడి,జూన్24( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలోని మొదటి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా విద్యార్థులు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు హాజరై విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటిస్తూ కేంద్రాలను నిర్వహించాలని, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీ స్త్రీలు, బాలబాలికలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

- పాఠశాలల్లో నాణ్యమైన పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన



**హుజూరాబాద్, జూన్ 24(తెలంగాణ ముచ్చట్లు ):** విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, సమగ్ర వికాసానికి పోషకాహారం కీలకమని హుజూరాబాద్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎన్. రాజు అన్నారు. విద్యార్థుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో అనేక మంది విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, ఇది వారి శారీరక ఎదుగుదలతో పాటు విద్యా ప్రగతిపైనా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని, అందుకోసం పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.
పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.
ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటి ఫలితాలు ప్రతి విద్యార్థికి చేరేలా విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పోషకాహారంపై అవగాహన పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.
విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎంఈఓ, పాఠశాలల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని పోషకాహార ప్రాముఖ్యతపై చర్చించారు. విద్యార్థుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హన్మకొండ,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల పూడికతీత తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. టెండర్లు పూర్తయి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనసాగుతున్న పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన, ఉప డ్రైనేజీల పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించిన కలెక్టర్, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న గృహ, వాణిజ్య నల్లా కనెక్షన్లను నిర్ణీత గడువులో మంజూరు చేయాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మహేందర్, మాధవి, సంజయ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మానేరు పక్కనే ఉన్న ఇసుక కోసం ప్రజల నిరీక్షణ..

- జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలి: మాజీ ఎంపీటీసీ దరుగుల రాకేష్

**జమ్మికుంట టౌన్ జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట (ఇల్లంతకుంట) మండలాల్లో నెలకొన్న ఇసుక కొరతను వెంటనే నివారించాలని మాజీ ఎంపీటీసీ దరుగుల రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఇళ్లు నిర్మించుకుంటున్న సామాన్య, పేద,మధ్యతరగతి కుటుంబాల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పాటు స్వంతంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ప్రజలకు సకాలంలో ఇసుక అందుబాటులో ఉండేలా జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకృతి ప్రసాదమైన మానేరు వాగు సమీపంలో ఉన్న ఉమ్మడి జమ్మికుంట మండల ప్రజలకు ఇసుక దొరకకపోవడం విచారకరమని పేర్కొన్నారు.
"గుండె నిండా పాలు ఉన్నా బిడ్డకు అందించలేని తల్లి పరిస్థితి రాకూడదు" అనే సామెతను ప్రస్తావిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉన్న సహజ వనరులను పారదర్శకంగా పంపిణీ చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇసుక సరఫరాలో పారదర్శకత, సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికార యంత్రాంగాన్ని కోరారు.
ఇల్లు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వెంటనే స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించాలని దరుగుల రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం - 25 - జూన్ 2026




# మహిళా నాయకత్వానికి మరో గౌరవం

- మహిళల ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసానికి కృషి చేస్తానన్న కస్తూరి

**హుజూరాబాద్,జూన్ 24(తెలంగాణ ముచ్చ-ట్లు ):** మహిళా సాధికారత కోసం విశేషంగా కృషి చేస్తున్న మహిళా నాయకులకు ప్రోత్సాహం అందించే క్రమంలో మహిళా ఎంపవర్మెంట్ తెలుగు అసోసియేషన్ హుజూరాబాద్ మండల కోఆర్డినేటర్‌గా చెల్పూర్ సర్పంచ్ వంతడుపుల కస్తూరి ని నియమించారు . హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆమెకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించవచ్చన్నారు. మహిళలు కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా వ్యాపారం, ఉపాధి, విద్య, రాజకీయాలు, సామాజిక సేవ తదితర రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

హుజూరాబాద్ మండలంలోని మహిళలను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు.

మహిళా సాధికారత దిశగా WETA India చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని, మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని కస్తూరి అన్నారు. మహిళలు తమ హక్కులు, అవకాశాలపై అవగాహన పెంచుకొని అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి మహిళా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని కస్తూరి కి శుభాకాంక్షలు తెలిపారు. హుజూరాబాద్ మండల కోఆర్డినేటర్‌గా ఆమె నియామకం స్థానిక మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని అందించి మహిళా సాధికారత కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తుందని అభిప్రాయపడ్డారు. మహిళల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్న కస్తూరి కి ఈ బాధ్యతలు మరింత గుర్తింపు తీసుకురానున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి..

- గుర్తించాలని పోలీసుల విజ్ఞప్తి

**ధర్మసాగర్,జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగరం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తుతెలియని మహిళను గుర్తించేందుకు పోలీసులు ప్రజల సహకారం కోరుతున్నారు.రాంపూర్ గ్రామ శివారులోని రంగసముద్రం చెరువు సమీపంలో జాతీయ రహదారి 163పై గుర్తుతెలియని వాహనం మహిళను ఢీకొట్టి పరారైంది. తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానికులు, 108 సిబ్బంది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మృతురాలు సుమారు 55 సంవత్సరాల వయస్సు, 5.5 అడుగుల ఎత్తు కలిగి ఉంది. ఆకుపచ్చ రంగు చీర, లేత ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉంది. ఆమె భిక్షాటన చేసే మహిళగా కనిపిస్తున్నట్లు పోలీసులు



అనుమానం వ్యక్తం చేశారు.

ఈ మహిళను ఎవరైనా గుర్తించినా, ఆమె కుటుంబ సభ్యులు లేదా బంధువుల వివరాలు తెలిసినా వెంటనే ఈ నంబర్లకు ఫోన్ చేసి 8712685010, 8712675127 ధర్మసాగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహం ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి ఉంచినట్లు తెలిపారు.

# బంగారం ధరల్లో తగ్గుదల..

**హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చ-ట్లు):** బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త.అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. అమెరికా డాలర్ బలపడటం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడిపై డిమాండ్ తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,300గా ఉంది. వెండి ధరలు కూడా తగ్గి, కిలో వెండి రూ.2,40,000గా కొనసాగుతోంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో కూడా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330గా, 22 క్యారెట్లు రూ.1,32,300గా ఉంది. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి.

# 57వ డివిజన్ బూత్ స్థాయి ఎన్నికల బాధ్యుల సమావేశం

**హన్మకొండ,జూన్24(తెలంగాణ ముచ్చ-ట్లు):** 57వ డివిజన్ బూత్ స్థాయి ఎన్నికల బాధ్యుల సమావేశం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఎల్. దీప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య మాట్లాడుతూ, 57వ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఇండ్ల స్థలాల కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి అనేక మంది పేదలకు ఇండ్ల పట్టాలు ఇప్పించామని తెలిపారు.ఇంజినీరింగ్ కాలనీలో ఇంకా ఇండ్ల పట్టాలు అందని ప్రజల కోసం పోరాటం కొనసాగుతోందని, సమ్మయ్య నగర్‌లో కూడా పూర్తి స్థాయిలో పట్టాల సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. అలాగే వాజ్‌పేయి కాలనీలో ఇప్పటికీ ఇంటి నంబర్లు కేటాయించలేదని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు.





ప్రజా సమస్యలపై పోరాడుతూ 57వ డివిజన్‌లో ఎర్రజెండా నాయకత్వంలో సీపీఎం కార్పొరేటర్ అభ్యర్థిని బరిలోకి దింపనున్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో 57వ డివిజన్ ఎన్నికల కోఆర్డినేటర్‌గా వి. వీరన్న, సహ కోఆర్డినేటర్లుగా పి. ఉప్పలయ్య, ఎల్. దీపలను ఎన్నుకున్నారు. ఇంజినీరింగ్ కాలనీ బూత్ కన్వీనర్‌గా కె. రవీందర్, సమ్మయ్య నగర్ కన్వీనర్‌గా ఎల్. దీప, గాంధీనగర్ కన్వీనర్‌గా వి. రాజును ఎంపిక చేశారు. అదనంగా 15 మంది బూత్ స్థాయి బాధ్యులను ఎన్నుకుని బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలతో కలిసి ఉద్యమాలు కొనసాగించాలని సమావేశం పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు కె. రవీందర్, జి. అరుణ, బి. లత, అనిత, స్వప్న, రాధిక, వి. రాజు, శాఖ కార్యదర్శి బి. రవి తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన టెన్త్ క్లాస్ బ్యాచ్ మిత్రులు

**స్టేషన్ ఘనపూర్, జూన్24(తెలంగాణ ముచ్చట్లు):** తాటికొండ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మారపాక బుచ్చయ్య మరణం పట్ల ఆయన కుటుంబానికి టెన్త్ క్లాస్ 200405 బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు.మారపాక బుచ్చయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న సహచర విద్యార్థులు ఆయన కుమారుడు, తమ స్నేహితుడు మారపాక శ్రీనివాస్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామనే భరోసాతో రూ.7,300 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

కష్టకాలంలో స్నేహితుడికి తోడుగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మిత్రులు తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రాములు, క్లాస్‌మేట్స్ దశరథ్, రమేష్, ఎ. కుమార్, బి. కుమార్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. భవిష్యత్తును కాపాడుకోండి

**విద్యార్థులకు వేలేరు పోలీసుల అవగాహన**

**వేలేరు, జూన్ 24: (తెలంగాణ ముచ్చట్లు ):** వేలేరు ఎస్సై సురేష్ మరియు పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో వేలేరులోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య మరియు సామాజిక నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేక అంశంపై రాత పరీక్ష పోటీ నిర్వహించగా, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్సై సురేష్ చేతుల మీదుగా మొదటి, రెండవ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్, అధ్యాపకులు (లెక్చరర్లు) మరియు సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ఉండేందుకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్సై సురేష్ తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.



# సూపర్ కంప్యూటింగ్‌లో చైనా అగ్రస్థానం

- ప్రపంచంలోనే వేగవంతమైన 'లైన్‌షైన్' సిస్టమ్
- రెండో స్థానానికి పడిపోయిన అమెరికా 'ఎల్ క్యాపిటన్'
- దేశీయ సాంకేతికతతో చైనా మరో ఘనత



**హాంబర్గ్, జూన్ 24 (తెలంగాణ ముచ్చ-ట్లు):** సూపర్ కంప్యూటర్ల రంగంలో చైనా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. దాదాపు దశాబ్దం తర్వాత ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌ను అభివృద్ధి చేసి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ సూపర్ కంప్యూటింగ్ సదస్సులో విడుదల చేసిన 'టాప్500' జాబితాలో చైనాకు చెందిన 'లైన్‌షైన్' సూపర్ కంప్యూటర్ మొదటి స్థానంలో నిలిచింది.

షెన్‌జెన్‌లోని జాతీయ సూపర్ కంప్యూటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన లైన్‌షైన్ సిస్టమ్ సెకనుకు 2.198 ఎగ్జాఫ్లాప్‌ల వేగాన్ని నమోదు చేసింది. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు చెందిన 'ఎల్ క్యాపిటన్' సిస్టమ్ 1.809 ఎగ్జాఫ్లాప్‌ల సామర్థ్యంతో రెండో స్థానానికి చేరింది. దీంతో చైనా మళ్లీ సూపర్ కంప్యూటింగ్ రంగంలో తన సత్తాను నిరూపించుకుంది.

2017లో 'సన్‌వే టైహులైట్' సూపర్ కంప్యూటర్ ద్వారా అగ్రస్థానంలో నిలిచిన తర్వాత చైనా మళ్లీ ఇప్పుడు ఈ ఘనత సాధించింది. మూడేళ్లుగా టాప్500 జాబితాలో పెద్దగా ప్రాధాన్యం పొందని చైనా, ఈసారి నేరుగా తొలి స్థానాన్ని దక్కించుకోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అమెరికా విధించిన సాంకేతిక ఆంక్షల మధ్య పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఈ సూపర్ కంప్యూటర్‌ను నిర్మించడం చైనా విజయంగా భావిస్తున్నారు. ఇందులో దేశీయంగా అభివృద్ధి చేసిన లింగ్‌కున్ ఎల్‌ఎక్స్2 ప్రాసెసర్లు, స్వంత ఇంటర్ కనెక్ట్ వ్యవస్థ, కైలిన్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించారు. మొత్తం 1.37 కోట్ల ప్రాసెసింగ్ కోర్లతో ఈ వ్యవస్థ పనిచేస్తోంది.

వాతావరణ మార్పుల అంచనా, ఇంజినీరింగ్ పరిశోధనలు, ఔషధాల అభివృద్ధి, కృత్రిమ మేధ, శాస్త్రీయ గణనల వంటి కీలక రంగాల్లో ఈ సూపర్ కంప్యూటర్ సేవలు అందించనుంది. భారీ డేటా విశ్లేషణ, క్లిష్ట గణనల నిర్వహణలో ఇది అత్యంత వేగంగా పనిచేయగలదని నిపుణులు చెబుతున్నారు. అయితే టాప్500 జాబితా సంప్రదాయ గణన సామర్థ్యాన్ని మాత్రమే కొలుస్తుందని, ఆధునిక కృత్రిమ మేధ సామర్థ్యాలను పూర్తిగా ప్రతిబింబించదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ స్వదేశీ సాంకేతికతతో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌ను రూపొందించడం ద్వారా చైనా సాంకేతిక రంగంలో మరో మైలురాయిని నమోదు చేసింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# నేలలో పెరిగే దుంపలే పోషకాల గని

**క్యారెట్ నుంచి చామగడ్డ వరకు ఆరోగ్యానికి మేలు**
**రోజువారీ ఆహారంలో దుంపలకు ప్రత్యేక స్థానం**


ప్రకృతి మనకు అందించిన అద్భుత ఆహార పదార్థాల్లో నేలలో పెరిగే దుంపలు ప్రత్యేకమైనవి. క్యారెట్, బీట్‌రూట్, చిలగడదుంప, చామగడ్డ, ముల్లంగి, ఆలుగడ్డ వంటి దుంపలు కేవలం ఆకలి తీర్చడమే కాదు, శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తాయి. అందుకే పోషకాహార నిపుణులు వీటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. దుంపలు నేల అడుగున పెరుగుతాయి. మొక్క తనకు అవసరమైన పోషకాలను నిల్వ చేసుకునే భాగమే దుంపగా మారుతుంది. అందువల్ల వీటిలో పిండి పదార్థాలు, పీచు, ఖనిజ లవణాలు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.క్యారెట్‌లో కంటి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. క్రమం తప్పకుండా క్యారెట్ తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడటంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. క్యారెట్‌లో ఉండే ప్రతిక్షకారిణులు శరీర కణాలను రక్షించడంలో సహాయపడతాయి.బీట్‌రూట్‌ను ఆరోగ్యానికి మేలు చేసే దుంపల్లో ఒకటిగా భావిస్తారు. ఇందులో ఇనుము, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. బీట్‌రూట్ రక్తహీనత సమస్యను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తప్రసరణ మెరుగుపడటానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.చిలగడదుంప సహజ తీపి కలిగిన ఆహారం. ఇందులో పీచు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తుంది. శరీరానికి అవసరమైన శక్తిని నెమ్మదిగా విడుదల చేయడం దీని ప్రత్యేకత.చామగడ్డ గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా ఉపయోగించే దుంప. ఇందులో పీచు, కార్బొహైడ్రేట్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. చామగడ్డతో చేసే వంటకాలు రుచికరంగా ఉండటమే కాకుండా శరీరానికి తగిన శక్తిని అందిస్తాయి. అనేక ప్రాంతాల్లో ఇది సంప్రదాయ ఆహారంలో భాగంగా కొనసాగుతోంది.ముల్లంగి కూడా నేలలో పెరిగే పోషకాహార దుంపే. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పాటు విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరంలోని మలినాలను బయటకు పంపడంలో ముల్లంగి ఉపయోగపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.ఆలుగడ్డ ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వినియోగించే దుంపల్లో ఒకటి. ఇందులో పిండి పదార్థాలు అధికంగా ఉండటంతో శరీరానికి శక్తి లభిస్తుంది. అయితే అధిక నూనెలో వేయించిన రూపంలో కాకుండా ఉడికించి లేదా తక్కువ నూనెతో వండుకుని తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది. దుంపల్లో పీచు అధికంగా ఉండటంతో జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడంలో ఇవి ఉపయోగపడతాయి. అంతేకాకుండా శరీరానికి అవసరమైన అనేక సూక్ష్మ పోషకాలను కూడా అందిస్తాయి. అందువల్ల చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ దుంపలను ఆహారంలో భాగం చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.ప్రస్తుతం శీఘ్ర ఆహారాల వైపు మొగ్గు పెరుగుతున్న తరుణంలో సంప్రదాయ ఆహార పదార్థాల ప్రాధాన్యం తగ్గుతోంది. అయితే నేలలో పెరిగే ఈ దుంపలు ఆరోగ్యానికి అందించే ప్రయోజనాలు ఎంతో గొప్పవి. సహజసిద్ధంగా లభించే ఈ పోషకాహార సంపదను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని కొనసాగించవచ్చు.

# వర్షం వరమా.. విపత్తా?

- **రుతుపవనాలతో రైతుల్లో కొత్త ఆశలు**
- **ప్రకృతి వరాన్ని సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్ భద్రం**




వేసవి వేడిమి నుంచి ఉపశమనం కలిగిస్తూ రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచిస్తోంది. వర్షాల రాకతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో నీటి నిల్వలు, వరద ముప్పు, రహదారుల దెబ్బతినడం వంటి సమస్యలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా 'వర్షం వరమా.. విపత్తా?' అనే చర్చ ప్రారంభమైంది.భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగానే కొనసాగుతున్నందున రుతుపవనాలు రైతుల జీవితాల్లో కీలక ప్రభావం చూపుతాయి. సమయానికి వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. పంటల దిగుబడులు మెరుగుపడతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం వస్తుంది. రైతుల ఆదాయం పెరిగి అనుబంధ రంగాలు కూడా లాభపడతాయి.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు అత్యంత కీలకం. వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటల సాగు కోసం రైతులు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. వర్షాలు అనుకూలంగా ఉంటే వ్యవసాయ రంగంలో ఆశాజనక పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. చెరువులు, కుంటలు, జలాశయాలు నిండితే భూగర్భ జలాలు కూడా పెరిగి తాగునీటి సమస్యలు తగ్గుతాయి.అయితే వర్షాలు కేవలం ప్రయోజనాలనే తీసుకురావు. కొన్నిసార్లు భారీ వర్షాలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు కురిసే వర్షానికే రహదారులు జలమయం అవుతున్నాయి. కాలువలు పొంగిపొర్లడం, వాహనాల రాకపోకలు నిలిచిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం వంటి సమస్యలు తరచూ కనిపిస్తున్నాయి. పలు నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థలు సరిపోకపోవడం దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.గత కొన్నేళ్లుగా వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు నెలల తరబడి కురిసే వర్షాలు ఇప్పుడు కొద్ది గంటల్లోనే భారీగా కురుస్తున్నాయి. ఫలితంగా ఆకస్మిక వరదలు, పంట నష్టాలు, రహదారుల ధ్వంసం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నప్పటికీ భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశాలపై దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో కూడా వర్షాల ప్రభావం మిశ్రమంగానే కనిపిస్తోంది. సాధారణ వర్షాలు రైతులకు లాభం చేకూర్చినా, అధిక వర్షాలు పంటలను దెబ్బతీస్తున్నాయి. పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల విత్తనాలు, మొక్కలు నష్టపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో కోతకు సిద్ధమైన పంటలు కూడా భారీ వర్షాల కారణంగా నేలమట్టమవుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు.పర్యావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం వర్షాలను విపత్తులుగా మార్చడంలో మానవ తప్పిదాల పాత్ర కూడా తక్కువ కాదు. చెరువులు, కాలువలు, వాగులను ఆక్రమించడం, అడవుల నరికివేత, ప్రణాళికా రహిత నిర్మాణాలు, ప్లాస్టిక్ వ్యర్థాల పెరుగుదల వంటి అంశాలు వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో సహజంగా బయటకు వెళ్లాల్సిన నీరు నివాస ప్రాంతాల్లోకి చేరి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది.ప్రభుత్వాలు కూడా వర్షాకాలానికి ముందే సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రపరిచే పనులు, వరద ముంపు ప్రాంతాల గుర్తింపు, సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ శాశ్వత పరిష్కారాల కోసం మరింత ప్రణాళికాబద్ధమైన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.వర్షపు నీటి సంరక్షణ కూడా ప్రస్తుతం అత్యంత అవసరమైన అంశంగా మారింది. ప్రతి ఇంట్లో వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు ఏర్పాటు చేయడం, భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం, చెరువులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ నీటి అవసరాలను తీర్చుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కురిసే ప్రతి చుక్క నీటిని భద్రపరిస్తేనే రాబోయే కాలంలో నీటి కొరత సమస్యను అధిగమించగలమని నిపుణులు చెబుతున్నారు.మొత్తంగా చూస్తే వర్షం ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరం. అదే సమయంలో సరైన ప్రణాళికలు లేకపోతే అది విపత్తుగా కూడా మారవచ్చు. కాబట్టి వర్షాన్ని కేవలం ప్రకృతి సంఘటనగా కాకుండా విలువైన సహజ వనరుగా భావించి దాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.



# సముద్రాలపై సాహసయాత్ర.. ప్రపంచానికి జీవనాధారం

భూమిపై నివసిస్తున్న కోట్లాది మంది ప్రజల జీవితాలు సముద్రాలతో ముడిపడి ఉన్నాయి. మనం ప్రతిరోజూ ఉపయోగించే అనేక వస్తువులు వేల కిలోమీటర్ల దూరంలోని దేశాల నుంచి సముద్ర మార్గాల ద్వారానే మనకు చేరుతున్నాయి. ఆ సరుకు రవాణా వెనుక నిశ్శబ్దంగా, నిరంతరం శ్రమించే వారు నావికులు. సముద్రాల మధ్య జీవిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కదిలించే ఈ సముద్ర యోధుల సేవలు అమూల్యమైనవి. ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మొత్తం సరుకు రవాణాలో ప్రధాన భాగం సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. చమురు, సహజ వాయువు, ఎరువులు, ధాన్యాలు, వాహనాలు, యంత్రాలు, వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటి అనేక ఉత్పత్తులు ఓడల ద్వారా దేశాల మధ్య చేరుతున్నాయి. ఈ ప్రక్రియలో నావికులు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అనుసంధానిస్తున్నారు. నావికుల జీవితం సాధారణ ఉద్యోగంలా ఉండదు. వారు నెలల తరబడి సముద్రంలోనే గడపాల్సి వస్తుంది. కుటుంబ సభ్యులను, స్వదేశాన్ని, పండుగలను, వ్యక్తిగత ఆనందాలను దూరం పెట్టి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఆరు నెలల నుంచి పది నెలల వరకు కూడా ఓడలపైనే ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. అయినప్పటికీ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రపంచ సరఫరా వ్యవస్థను కొనసాగిస్తున్నారు.సముద్ర ప్రయాణాల్లో ఎన్నో ప్రమాదాలు ఎదురవుతుంటాయి. భారీ అలలు, తుఫాన్లు, వర్షాలు, మంచు తుఫాన్లు, తీవ్ర ఉష్ణోగ్రతలు నావికులకు సవాళ్లుగా మారుతాయి. కొన్ని ప్రాంతాల్లో సముద్ర దొంగల బెదిరింపులు కూడా ఉంటాయి. అయినప్పటికీ ఈ కష్టాలను అధిగమిస్తూ వారు తమ విధులను కొనసాగిస్తుంటారు. సముద్రంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు నావికుల అనుభవం, ధైర్యం ఎంతో కీలకంగా మారుతుంది. ప్రపంచీకరణ యుగంలో నావికుల పాత్ర మరింత పెరిగింది. ఒక దేశంలో తయారైన వస్తువులు మరో దేశంలోని వినియోగదారులకు చేరాలంటే సముద్ర రవాణా వ్యవస్థ అత్యంత ముఖ్యమైనది. సరుకు రవాణాలో అంతరాయం ఏర్పడితే ప్రపంచ వ్యాప్తంగా ధరలు పెరగడం, సరుకుల కొరత ఏర్పడటం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే నావికులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా అభివర్ణిస్తారు.కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచం నావికుల సేవల విలువను మరింతగా గుర్తించింది. లాక్‌డౌన్‌లు, ప్రయాణ ఆంక్షలు, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వారు విధులు నిర్వర్తించారు. అనేక నౌకాశ్రయాల్లో చిక్కుకుపోయినా, కుటుంబాలకు దూరంగా ఉన్నా ప్రపంచ అవసరాలకు కావాల్సిన సరుకులను గమ్యస్థానాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో వారి సేవలను ప్రపంచ దేశాలు ప్రత్యేకంగా ప్రశంసించాయి.సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పటికీ నావికుల అవసరం తగ్గలేదు. ఆధునిక నౌకలు, ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలు, డిజిటల్ సమాచార సదుపాయాలు అందుబాటులోకి వచ్చినా వాటిని సమర్థంగా నిర్వహించేందుకు నైపుణ్యం కలిగిన నావికులు అవసరమే. భవిష్యత్తులో సముద్ర రవాణా రంగం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నందున నావికుల ప్రాధాన్యం కూడా పెరగనుంది. నావికుల సంక్షేమం, ఆరోగ్య భద్రత, మానసిక స్థైర్యం, కుటుంబ సంక్షేమం వంటి అంశాలపై ప్రపంచ దేశాలు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. సముద్రాల్లో నిరంతరం శ్రమిస్తూ ప్రపంచాన్ని అనుసంధానిస్తున్న ఈ సముద్ర వీరుల సేవలను గుర్తించడం సమాజం బాధ్యత. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సజావుగా నడవడంలో వారి కృషి చిరస్మరణీయమైనది.సముద్రాలు ఎంత విశాలమైనవో, నావికుల సేవలు కూడా అంత గొప్పవి. వారు కనిపించకపోయినా ప్రపంచాన్ని కదిలించే శక్తిగా నిలుస్తున్నారు. సముద్ర మార్గాలపై తమ జీవితాలను అంకితం చేసిన ఈ నావికుల త్యాగం, కృషి, అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయి.

# తెల్లమచ్చలు కాదు.. ఆత్మవిశ్వాసానికి పరీక్ష

- **అపోహల మధ్య బాధితుల పోరాటం**
- **అవగాహనతోనే వివక్షకు ముగింపు**



ప్రపంచంలో అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, వాటిలో కొన్ని శారీరకంగా కన్నా మానసికంగా ఎక్కువ ప్రభావం చూపుతాయి. అలాంటి పరిస్థితుల్లో విటిలిగో ఒకటి. సాధారణంగా తెల్లమచ్చల వ్యాధిగా పిలిచే ఈ సమస్య వల్ల చర్మంపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. అయితే ఈ మచ్చల కంటే వాటి చుట్టూ ఏర్పడే అపోహలు, సామాజిక వివక్ష, అవగాహన లేమి బాధితులను మరింతగా ఇబ్బందులకు గురిచేస్తుంటాయి. ఈ పరిస్థితిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, బాధితులకు మద్దతు అందించేందుకు ప్రతి ఏడాది జూన్ 25న ప్రపంచ విటిలిగో దినాన్ని నిర్వహిస్తున్నారు.విటిలిగో అనేది చర్మానికి సహజ రంగును అందించే మెలనిన్ అనే వర్ణద్రవ్యం తగ్గిపోవడం వల్ల ఏర్పడే పరిస్థితి. మెలనిన్‌ను ఉత్పత్తి చేసే కణాలు పనిచేయకపోవడం లేదా నశించడం వల్ల చర్మంపై తెల్లని మచ్చలు కనిపిస్తాయి. మొదట చిన్న ప్రాంతంలో ప్రారంభమైన ఈ మార్పు కొందరిలో క్రమంగా విస్తరించే అవకాశం ఉంటుంది. ముఖం, చేతులు, కాళ్లు, పెదవుల చుట్టూ, కళ్ల సమీపంలో ఎక్కువగా కనిపించినప్పటికీ శరీరంలోని ఏ భాగానికైనా వ్యాపించవచ్చు.వైద్య నిపుణుల అంచనాల ప్రకారం ప్రపంచ జనాభాలో గణనీయమైన సంఖ్యలో ప్రజలు విటిలిగోతో జీవిస్తున్నారు. ఇది ఏ దేశానికీ, ఏ వర్గానికీ పరిమితమైన సమస్య కాదు. పిల్లలు, యువత, మధ్య వయస్కులు, వృద్ధులు ఇలా ఎవరికైనా ప్రభావితం చేయవచ్చు. పురుషులు, మహిళలు అనే తేడా కూడా ఉండదు. అయినప్పటికీ ఈ పరిస్థితిపై సమాజంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల బాధితులు అనవసరమైన ప్రశ్నలు, వ్యాఖ్యలు, వివక్షను ఎదుర్కొంటున్నారు.విటిలిగో గురించి ప్రజల్లో ఉన్న అతిపెద్ద అపోహ ఇది అంటువ్యాధి అనే భావన. కొందరు బాధితులతో కలిసివుంటే తమకూ వస్తుందని భావిస్తుంటారు. కానీ ఇది పూర్తిగా తప్పుడు అభిప్రాయం. విటిలిగో ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. స్పర్శ, కలిసి భోజనం చేయడం, ఒకే వస్తువులు ఉపయోగించడం లేదా ఇతర మార్గాల ద్వారా సంక్రమించే అవకాశం లేదు. వైద్యశాస్త్రం ఈ విషయాన్ని స్పష్టంగా నిర్ధారించినప్పటికీ ప్రజల్లో ఇంకా అపోహలు కొనసాగుతూనే ఉన్నాయి.కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ విటిలిగోను శాపం, పాపం లేదా మూఢనమ్మకాలతో ముడిపెడుతున్నారు. ఇలాంటి తప్పుడు అభిప్రాయాలు బాధితుల జీవితాలను మరింత కష్టతరం చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడం వల్ల కొందరు సామాజికంగా ఒంటరితనానికి గురవుతున్నారు. వివాహ సంబంధాల విషయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా అనేక మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.విటిలిగోకు ఖచ్చితమైన కారణం ఇప్పటికీ పూర్తిగా నిర్ధారణ కాలేదు. అయితే రోగనిరోధక వ్యవస్థలో మార్పులు, జన్యుపరమైన అంశాలు, కొన్ని పర్యావరణ ప్రభావాలు, మానసిక ఒత్తిడి వంటి కారణాలు దీనికి దోహదపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. కొందరిలో కుటుంబ చరిత్ర ఉండవచ్చు. మరికొందరిలో ఎలాంటి నేపథ్యం లేకుండానే ఈ పరిస్థితి కనిపించవచ్చు.తెల్లమచ్చలు శరీర ఆరోగ్యానికి పెద్దగా హాని కలిగించకపోయినా మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా యుక్తవయసులో ఉన్న యువతలో ఆత్మన్యూనత భావం పెరగడం, స్నేహితుల నుంచి దూరం కావడం, బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెనుకాడడం వంటి పరిస్థితులు కనిపిస్తాయి. కొందరిలో ఆందోళన, నిరాశ, ఒంటరితనం కూడా పెరుగుతుంది. అందుకే ఈ సమస్యను కేవలం చర్మ సమస్యగా కాకుండా మానసిక ఆరోగ్య కోణంలో కూడా చూడాల్సిన అవసరం ఉంది.కుటుంబ సభ్యుల పాత్ర ఈ సందర్భంలో చాలా ముఖ్యమైనది. బాధితులను విమర్శించడం, జాలితో చూడడం కాకుండా వారికి ధైర్యం చెప్పడం అవసరం. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా ప్రవర్తించాలి. పాఠశాలల్లో, కళాశాలల్లో, కార్యాలయాల్లో కూడా వివక్షకు తావులేకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.ఆధునిక వైద్యశాస్త్రం విటిలిగో చికిత్సలో గణనీయమైన పురోగతి సాధించింది. వివిధ రకాల మందులు, కాంతి చికిత్సలు, ప్రత్యేక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే పరిస్థితిని నియంత్రించే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి వ్యక్తిలో వ్యాధి స్వభావం భిన్నంగా ఉండటం వల్ల చికిత్స కూడా వ్యక్తిగతంగా మారుతుంది. అందువల్ల వైద్యుల సలహా మేరకే చికిత్స తీసుకోవడం అవసరం.ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ప్రముఖులు కూడా విటిలిగోతోనే విజయవంతమైన జీవితాన్ని గడిపారు. కళలు, క్రీడలు, వ్యాపారం, విద్య, సామాజిక సేవ వంటి రంగాల్లో తమ ప్రతిభతో గుర్తింపు పొందారు. వారి విజయాలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. చర్మంపై ఉన్న తెల్లమచ్చలు ఒక వ్యక్తి భవిష్యత్తును నిర్ణయించవు. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసమే విజయానికి అసలు ప్రమాణాలు.సామాజిక మాధ్యమాల ద్వారా ప్రస్తుతం విటిలిగోపై అవగాహన పెరుగుతున్నప్పటికీ ఇంకా చాలా పని మిగిలే ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# చరణ్‌పై చిరంజీవి భావోద్వేగ పోస్ట్.. తండ్రిగా గర్వంగా ఉందన్న మెగాస్టార్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో రామ్ చరణ్‌కు లభించిన ప్రత్యేక గుర్తింపుపై మెగాస్టార్ చిరంజీవి భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా చేసిన తన పోస్టులో కొడుకు సాధించిన విజయాన్ని చూసి తండ్రిగా ఎంత గర్వంగా ఉందో హృదయానికి హత్తుకునేలా వ్యక్తం చేశారు. చిరంజీవి తన పోస్టును సుమతీ శతకంలోని ప్రసిద్ధ పద్యంతో ప్రారంభించారు. "పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ" అంటూ రాసిన ఆయన, కొడుకు పుట్టడమే తండ్రికి అసలైన ఆనందం కాదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని గుర్తించి ప్రశంసించినప్పుడే తండ్రికి నిజమైన సంతోషం కలుగుతుందని పేర్కొన్నారు. నిన్న ప్రధానమంత్రి





నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను "న్యూ ఏజ్ మెగాస్టార్"గా సంబోధించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గౌరవం, గుర్తింపు చూస్తుంటే తండ్రిగా గర్వంగా ఉందన్నారు. రామ్ చరణ్ తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకున్నాడని చిరంజీవి ప్రశంసించారు. ఇక ముందు కూడా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. చిరంజీవి చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులతో పాటు సినీ అభిమానులు కూడా ఈ పోస్టును పెద్ద ఎత్తున షేర్ చేస్తూ రామ్ చరణ్‌కు అభినందనలు తెలియజేస్తున్నారు.



యూట్యూబ్ వేదికగా తెలంగాణ ఫోక్ డ్యాన్స్‌లతో గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ యువ నటి ఇప్పుడు వరుస సినిమా అవకాశాలతో బిజీగా మారింది.

ఇప్పటికే తమిళంలో తెరకెక్కుతున్న 'లవ్ ఓ లవ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న నాగదుర్గ, వెండితెరపై తన తొలి అడుగు వేసింది. దర్శకుడు మగేష్ రాజేంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో పవిష్ నారాయణ్ సరసన ఆమె ఫీమేల్ లీడ్‌గా నటిస్తోంది. ఇది ఆమెకు తమిళ చిత్రసీమలో తొలి అవకాశం కావడం విశేషం.

ఇక టాలీవుడ్‌లో కూడా నాగదుర్గకు పెద్ద అవకాశం దక్కినట్లు సమాచారం. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఓ గ్రామీణ కుటుంబ నేపథ్య కథలో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది.

ఒకప్పుడు యూట్యూబ్‌లో ఫోక్ వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాగదుర్గ ఇప్పుడు వరుసగా సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ వెండితెర వైపు వేగంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే పాత్రల్లో ఆమె నటన ఎలా ఉంటుందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

మరోవైపు గతంలో సుకుమార్ చిత్రంలో చిన్న పాత్ర చేసిన ప్రియదర్శి ఇప్పుడు అదే బ్యానర్‌లో హీరోగా నటించనుండటం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

# ఫోక్ క్వీన్ నాగదుర్గకు వరుస ఆఫర్లు.. టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ




# సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు 'సర్దార్ 2'

తమిళ స్టార్ హీరో కార్తీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాలో కార్తీ మరోసారి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే మొదటి భాగం యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది.


ఈ చిత్రంలో కార్తీ సరసన మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్య 'బ్లాక్ డాగర్' పాత్రలో పవర్‌ఫుల్ విలన్‌గా కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అలాగే కమెడియన్ యోగి బాబు కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు.

సాంకేతిక విభాగం కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, జార్జ్ సి విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయ్ వేలుకుట్టి ఎడిటింగ్ చేయగా, యాక్షన్ సన్నివేశాలను దిలీప్ సుబ్బరాయన్ రూపొందిస్తున్నారు.

మొదటి భాగాన్ని మించిన యాక్షన్, మరింత థ్రిల్లింగ్ అంశాలతో 'సర్దార్ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. విడుదల తేదీ ఖరారవడంతో కార్తీ అభిమానుల్లో సినిమా పట్ల ఉత్సాహం మరింత పెరిగింది.

# 'ధర్మన్'గా రానున్న రజినీకాంత్ కొత్త సినిమా

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'తలైవర్ 173' టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. "ధర్మం వర్ధిల్లుతుంది" అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. పోస్టర్‌ను బట్టి చూస్తే ఈ చిత్రంలో రజినీకాంత్ డాక్టర్ పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ చిత్రాన్ని ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.



# జయం రవి ఇంట్లో కలకలం..

తమిళ స్టార్ హీరో జయం రవి అలియాస్ రవి మోహన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివాదాలతో ఇటీవల తరచూ వార్తల్లో నిలుస్తున్న ఆయన పేరు ఇప్పుడు మరో ఘటనతో చర్చనీయాంశంగా మారింది. తన ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా కార్మికులతో పాటు ఓ బాలుడిని అక్రమంగా నిర్బంధించారనే ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

చెన్నైలోని నీలాంకరై ప్రాంతంలో రవి మోహన్ నివాసం ఉంటున్నారు. సమాచారం ప్రకారం, తన ఇంట్లో దొంగతనం జరిగిందనే అనుమానంతో ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరు మహిళలతో పాటు ఓ బాలుడిని ఇంట్లోనే ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనికి వెళ్లిన వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

వారిలో ఒకరు నేరుగా రవి మోహన్ నివాసానికి వెళ్లి విచారించగా, వారిని ఇంట్లోనే ఉంచినట్లు తెలిసిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తమ వారిని వెంటనే పంపించాలని కోరినప్పటికీ అందుకు అంగీకరించలేదని వారు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనపై బాధితుల కుటుంబ సభ్యులు నీలాంకరై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే రవి మోహన్ నివాసానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం. ఇంట్లో పనిచేసే వారిని బలవంతంగా నిర్బంధించడం సరైన పద్ధతి కాదని, దొంగతనం జరిగిందనే అనుమానం ఉంటే చట్టపరంగా ఫిర్యాదు చేయాలని, స్వయంగా విచారణ జరపడం సరికాదని పోలీసులు సూచించినట్లు తెలుస్తోంది.

పోలీసుల జోక్యంతో అక్కడ ఉన్న మహిళలు, బాలుడు బయటకు వచ్చినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలను రవి మోహన్ తరఫు ప్రతినిధులు పూర్తిగా ఖండించారు. వారి వాదన ప్రకారం, ఇంట్లో నగదు, ఆభరణాలు కనిపించకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించామని, కానీ ఎలాంటి అక్రమ నిర్బంధం జరగలేదని స్పష్టం చేశారు. దొంగతనంపై అనుమానాలు వ్యక్తం చేయడం మాత్రమే జరిగిందని, ఈ ఘటనను తప్పుగా ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇరు వర్గాల వాదనలు పూర్తిగా భిన్నంగా ఉండటంతో అసలు ఏం జరిగింది, నిజంగా నిర్బంధం జరిగిందా లేదా దొంగతనం అనుమానంతో ప్రశ్నించడమేనా అన్న అంశాలపై దర్యాప్తు అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇటీవల వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలతో కూడా రవి మోహన్ తరచూ వార్తల్లో నిలుస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు ఈ కొత్త వివాదం కోలీవుడ్‌లో మరింత చర్చకు దారి తీసింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# భద్రతతోనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

- రామగుండం–2లో త్రైపాక్షిక భద్రతా సమీక్ష సమావేశం
- 'జీరో హార్మ్' లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపు
- గనుల్లో శాస్త్రీయ భద్రతా అధ్యయనాలపై దృష్టి

**పెద్దపల్లి, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** రామగుండం ఏరియా-2లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో 21వ త్రైపాక్షిక భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. గనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులు సూచించారు. సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. యంత్రాల పని గంటలను సమర్థవంతంగా పెంచి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. ప్రతి గనిలో శాస్త్రీయ భద్రతా అధ్యయనాలు నిర్వహించి ఉద్యోగుల్లో భద్రతా అవగాహన పెంపొందించాలని అన్నారు.

2026-27 సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను 'జీరో హార్మ్' లక్ష్యంతో సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ఉత్పత్తి, భద్రత రెండింటినీ సమన్వయం చేయాలని సూచించారు.

డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) సాగేష్ కుమార్ ఎం.ఆర్. నేతృత్వంలోని డీజీఎంఎస్ బృందం గత సమావేశంలో చేసిన సూచనల అమలు తీరును సమీక్షించింది. ప్రమాదాల నివారణ చర్యలు, యంత్రాల భద్రత, విద్యుత్ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. రామగుండం-2 జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య మాట్లాడుతూ ప్రమాద రహిత ఉత్పత్తి కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు, కార్మికుల్లో భద్రతా సంస్కృతి పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ముందస్తు భద్రతా చర్యల వల్ల ప్రమాదాల అవకాశాలు గణనీయంగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు.

సమావేశంలో డీజీఎంఎస్ డిప్యూటీ డైరెక్టర్లు అనిల్ టొప్పో, కౌశిక్ సేన్‌గుప్తా, దీపక్ కుమార్ ప్రభాకర్, కోమల్ చౌదరి, కార్పొరేట్ జీఎం (సేఫ్టీ) కె. సాయిబాబు, ఆర్జీ రీజియన్ జీఎం (సేఫ్టీ) ఎం. మల్లయ్య, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి జి. సాంబశివరావు, సీఎంవోఏఐ ప్రధాన కార్యదర్శి పి. నరసింహులు తదితర అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాలుగు నెలల కనిష్ఠానికి క్రూడ్ ఆయిల్ ధరలు..

**న్యూఢిల్లీ, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గుతూ నాలుగు నెలల కనిష్ఠస్థాయికి చేరుకున్నాయి. ఇటీవల వరకు ప్రపంచ మార్కెట్లను కలవరపెట్టిన చమురు ధరలు ఇప్పుడు క్రమంగా దిగివస్తున్నాయి.




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ప్రయత్నాలు ముందుకు సాగడం ఈ తగ్గుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఫలితంగా సరఫరా అంతరాయం భయం తగ్గిపోవడంతో పెట్టుబడిదారుల ఆందోళన కూడా తగ్గింది.

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర సుమారు 76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఒకే రోజులో ఈ రెండు సూచీలు ఒక శాతానికి పైగా పడిపోవడం గమనార్హం. గత నెల రోజుల వ్యవధిలో బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు 20 శాతానికి పైగా తగ్గాయి.

ఇరాన్ సంక్షోభం ప్రారంభ సమయంలో హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా ప్రభావితమవుతుందనే ఆందోళనలు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అయితే ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిలిచిపోయిన చమురు ట్యాంకర్లు తిరిగి రవాణాకు సిద్ధమవుతున్నట్లు సమాచారం రావడంతో మార్కెట్‌లో ఒత్తిడి తగ్గింది.

అమెరికా, ఇరాన్‌తో పాటు ప్రాంతీయ దేశాల మధ్య జరుగుతున్న దౌత్య చర్చలు కూడా పరిస్థితి మెరుగుపడటానికి దోహదపడుతున్నాయి. సరఫరాలో పెద్ద అంతరాయం ఉండకపోవచ్చనే అంచనాలు బలపడటంతో చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి.

ఈ తగ్గుదల భారత్‌కు సానుకూలంగా మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భారత్ ఎక్కువగా ముడి చమురును దిగుమతి చేసుకుంటుండటంతో ధరలు తగ్గితే దిగుమతి వ్యయం తగ్గుతుంది. దాంతో ద్రవ్యోల్బణంపై ఒత్తిడి కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఇల్లందు సమస్యలపై మంత్రి దృష్టి

- మంత్రి కోమటిరెడ్డిని కలిసిన గుమ్మడి నర్సయ్య
- ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు
- అధికారులతో చర్చించి పరిష్కారాలపై ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇల్లందు ప్రాంతానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలను గుమ్మడి నర్సయ్య వివరించారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

సమస్యలను ఓపికగా విన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వాటిపై సానుకూలంగా స్పందించారు. ప్రజలకు ఉపయోగపడే అంశాల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధులు సూచించే సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి ప్రాంతానికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇల్లందు ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలపై త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ భేటీ సానుకూల వాతావరణంలో జరిగినట్లు తెలిసింది.



# ఇందిరమ్మ ఇళ్లలోకి లబ్ధిదారుల గృహప్రవేశం

- నూతన గృహాలను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- బంట్వారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం

**వికారాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బంట్వారం మండల కేంద్రంలో నూర్లాపూర్ నిర్మల చంద్రయ్య, సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన గుర్నాపూర్ సత్యమ్మ, మల్లయ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో పేదలు సొంత గృహాలను నిర్మించుకొని గౌరవప్రదమైన జీవనం గడిపే అవకాశం పొందుతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

నూతన గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు భద్రమైన నివాసం లభించడం సంతోషకరమని పేర్కొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు గృహ నిర్మాణ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం వేగవంతం చేస్తోందని స్పీకర్ తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా గ్రామాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్పీకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# వాగు దాటించేందుకు తెప్పే దిక్కు

- ములుగులో హృదయ విదారక ఘటన
- అనారోగ్య బాధితుడిని తెప్పపై తరలించిన గ్రామస్థులు
- ఎలిశెట్టిపల్లిలో వంతెన కోసం డిమాండ్

**ములుగు, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా జంపన్న వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్థులు తెప్పను ఆశ్రయించాల్సి వచ్చింది.





గ్రామానికి చెందిన రాకేష్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని ప్రయత్నించారు. అయితే గ్రామానికి వెలుపలికి వెళ్లే మార్గంగా ఉన్న జంపన్న వాగు పొంగిపొర్లుతుండటంతో ఎలాంటి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోయింది. దీంతో గ్రామస్థులు కలిసి తెప్పను ఏర్పాటు చేసి రాకేష్‌ను వాగు దాటించారు.

తెప్పపై రోగిని తరలిస్తున్న దృశ్యాలు స్థానికులను కలచివేశాయి. అత్యవసర పరిస్థితుల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని తెలిపారు. జంపన్న వాగుపై వంతెన లేకపోవడం వల్ల ఎలిశెట్టిపల్లి గ్రామం తరచూ బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతోందని స్థానికులు పేర్కొన్నారు. అనారోగ్య బాధితులు, గర్భిణులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో కూడా ప్రమాదకరంగా వాగు దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ ప్రజలు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని ఆరోపించారు. జంపన్న వాగుపై వంతెన నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వంతెన నిర్మిస్తే గ్రామ ప్రజల దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. భారీ వర్షాలతో జిల్లాలోని పలు వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరిస్తున్నారు. కాగా ఎలిశెట్టిపల్లి ఘటన మరోసారి గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అవసరాన్ని స్పష్టంగా చాటిచెప్పింది.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

- హుజూర్‌నగర్ ఉప ఎన్నికల నాటి ఐదు కేసుల కొట్టివేత
- ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కేసుల్లో విముక్తి
- చట్టపరంగా ముగిసిన దీర్ఘకాల వివాదం

**హైదరాబాద్, జూన్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన ఐదు కేసులను తెలంగాణ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రేవంత్ రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్పట్లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న ఆయనపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించారనే అభియోగాలతో పోలీసులు పలు కేసులు నమోదు చేశారు.

తనపై నమోదైన కేసులు చట్టపరంగా నిలబడవని పేర్కొంటూ రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసుల కొట్టివేత కోసం ఆయన ఐదు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న న్యాయస్థానం గత జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పు వెల్లడించిన హైకోర్టు, అన్ని కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. కేసులలో కొనసాగుతున్న న్యాయపరమైన ప్రక్రియను రద్దు చేస్తూ రేవంత్ రెడ్డికి ఉపశమనం కల్పించింది. దీంతో చాలా కాలంగా కొనసాగుతున్న ఈ వ్యవహారానికి ముగింపు లభించినట్లైంది.

ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఈ కేసులు రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారాయి. హైకోర్టు తాజా తీర్పుతో ముఖ్యమంత్రిపై ఉన్న న్యాయపరమైన భారం తొలగిపోయిందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనల అమలు, ప్రచార అనుమతులు, ప్రజా సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై ఈ తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఈ కేసులకు సంబంధించిన అన్ని న్యాయ ప్రక్రియలు ముగిసినట్లు స్పష్టమైంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in